క్లుప్తంగా

స్నేహ హస్తం..

● రూ. 50 వేల సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్ర బృందం

తరిగొప్పుల (నర్మెట): కేన్సర్‌తో బాధపడుతూ మిత్రుడు భూక్య రాజన్న (36) మృతిచెందగా 2004–05 టెన్త్ క్లాస్ మిత్రులు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి రూ. 50 వేలు సాయంతో స్నేహ హస్తం అందించారు. గతంలో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. 28 వేలు అందించామని, ఇకముందు కూడా కుటుంబానికి అండగా ఉంటామని కటుంబ సభ్యులకు ఈ సందర్భంగా వారు తెలిపారు. గుండేటి రాంచందర్ , కొంపెల్లి అంబేద్కర్, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్, రమేష్, రాజు, రామకృష్ణ, యాంజి, స్వర్ణ రేఖ, కళ్యాణి, రజనీ, స్వరూప తదితరులు ఉన్నారు.

విరాళం



చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

చిల్పూరు: ఆలయం వద్ద వాటర్ ట్యాంకు నిర్మాణానికి దాతలు శుక్రవారం రూ. 50 వేల విరాళం అందజేశారు. చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం గుట్ట కింది భక్తులు సేద దీరే చోట తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త పుల్యాల నారాయణరెడ్డి–సుశీల దంపతులు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఈఓ లక్ష్మీప్రసన్నలకు విరాళం అందజేశారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ధర్మకర్తలు వేముల వెంకటేశ్వర్లు, గణగోని రమేష్, భూక్య శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

'కొత్త టీచర్ల సర్వీస్ తేదీ మార్చాలి'

జనగామ: రాష్ట్ర ఆర్థిక శాఖ నూతన ఆదేశాలను అనుసరించి కొత్త టీచర్ల సర్వీస్ తేదీని అక్టోబర్ 10 నుంచి పరిగణించాలని 2024–డీఎస్సీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు రావుల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు అక్టోబర్ 16 నుంచి వేతనాలు చెల్లించారని తెలిపారు. ఎల్‌బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా జాయినింగ్ పత్రాలు అందుకున్న రోజు నుంచే వేతనాలు ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ట్రెజరీ శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దీంతో రాష్ట్రంలోని 10,500 మంది కొత్త టీచర్లకు ఆరు రోజుల వేతనాలు అందనున్నట్లు స్పష్టం చేశారు. అంతే కాకుండా సర్వీసులో ఆరు రోజుల వెనక్కి నుంచి పరిగణలోకి తీసుకుంటారన్నారు. సంఘం నాయకులు ఇర్ఫాన్, రాము, శ్రీను, కోటేష్, రమ్యశ్రీ, కావ్య, స్వప్నలత, ప్రియాంక ఉన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం కృష్ణను సన్మానిస్తున్న డీఈఓ

జనగామ రూరల్: పసరమడ్ల ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ భోజన్న శుక్రవారం సందర్శించారు. తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి పుస్తకాలు, దుస్తులు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా హెచ్‌ఎం బి. కృష్ణ తన కుమారుడు గరుడ స్కందను 1వ తరగతిలో చేర్పించినందుకు అతడిని సన్మానించి అభినందించారు. కృష్ణను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాగా, ఉపాధ్యాయులు ఎం.నేత, జి.హేమలతలు 1,2వ తరగతి గదులకు అందంగా పేటింగ్ వేసి తీర్చిదిద్దగా వాటిని డీఈఓ ప్రారంభించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

రఘునాథపల్లి: ప్రేమ విఫలమై రఘునాథపల్లి మండలం మండలగూడేనికి చెందిన డ్యాగల కిరణ్ (24) యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని జైనపల్లి గ్రామ శివారులో తెల్లవారు జామున చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన డ్యాగల ఎల్లయ్య–రాజమణి దంపతుల రెండో కుమారుడు కిరణ్ హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నివాసం ఉంటూ అమెజాన్‌లో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ ఓ యువతిని ప్రేమించగా ఆమె కాదనడంతో తన ప్రేమ విఫలం అయిందని ఇక తాను బతకలేనంటూ సూసైడ్ నోట్ రాసి తెల్లవారు జామున చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసుకున్నారు.

ఊరిస్తున్న మబ్బులు.. జాడలేని వానలు

- ● దాటిపోయిన రోహిణి, మృగశిర కార్తెలు
- ● ఆందోళన చెందుతున్న రైతులు
- ● వరుణుడు కరుణించాలని పూజలు



జఫర్‌గఢ్ శివారులో వర్షాలు లేక పత్తి మొక్కలకు నీరు కడుతున్న రైతు



తమ్మడపల్లి (జి) గ్రామంలో వానలు కురవక దుక్కులు దున్ని వదిలేసిన రైతు

జఫర్‌గఢ్: ఒకవైపు ఊరిస్తున్న కారుమబ్బులు, మరోవైపు జాడలేని వర్షాలు.. ఆకాశం వైపు రైతుల ఎదురు చూపులు.. చినుకైనా కురవకపోవడంతో సాగుకు నోచుకోని దుక్కులు.. సాగు చేసిన విత్తనాలు మొలకెత్తకపోవడం.. మొలకెత్తిన విత్తనాలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. వానలు కురవాలని వరుణుడికి నిత్యం రైతులు, ప్రజలు పూజలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన తొలకరి వర్షంతో రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి దుక్కులు దున్నారు. పెద్ద ఎత్తున విత్తనాలను కొనుగోలు చేశారు. మరికొంత మంది రైతులు ఇప్పటికే పత్తితో పాటు మొక్కజొన్న పంటలను సాగు చేశారు. రోహిణి, మృగశిర కార్తెలు దాటిపోయినా గత కొద్ది రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వర్షాల ఆధారంగానే పంటల సాగు

జఫర్‌గఢ్ ప్రాంతం పూర్తిగా మెట్ట భూములు కలిగి ఉండడం వల్ల అత్యధిక శాతం రైతులు వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఈ ఖరీఫ్ ఆరంభంలోనే కొద్ది పాటి వర్షాలు కురియడంతో కొందరు దుక్కులు దున్ని పత్తి పంటతో పాటు మొక్కజొన్న పంటలు సాగు చేశారు. మరికొందరు రైతులు దుక్కులు సిద్ధం చేసి పంటల సాగు కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో 12,712 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటలు కూడ సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇటీవల కురిసిన తొలకరి వర్షంతో పాటు అడపాదడపా పడుతున్న వర్షాలకు సుమారు 1,500 ఎకరాలు మాత్రమే రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఇంకా చాలా మంది రైతులు పంటలు సాగు చేయాల్సి ఉంది. కొద్ది రోజులుగా వరుణుడి జాడ లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. కేవలం నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే పత్తి పంటకు నీటి తడులు కట్టి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండగా వర్షాలపై ఆధారపడి సాగు చేసిన రైతులు మాత్రం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ప్రాథమిక దశలోనే విత్తనాలు ఆవిరైపోయి మొలకెత్తకపోవడంతో పెట్టిన పెట్టుబడులు సైతం మట్టిపాలయ్యాయి. ఇప్పటికైనా వరుణుడు కరుణించి సమృద్ధిగా వానలు కురిపించాలని, లేకుంటే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు లేక దుక్కులు దున్ని వదిలేశా..



నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేసేందుకు దుక్కులు సిద్ధం చేశా. వర్షాలు లేక పంట సాగు చేయలేదు. 20 గుంటల్లో సాగు చేసిన మొక్కజొన్న మొలకెత్తలేదు. ఒకవైపు అదను కూడా దాటిపోతున్నది. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు సాగు చేయడం రైతులకు కష్టంగా మారుతుంది.

- కొంతం చంద్రయ్య, రైతు, తమ్మడపల్లి (జి)

రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశా



ఇటీవల కురిసిన తొలకరి వర్షానికి రెండున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. గత కొద్ది రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తక ఎండిపోతున్నాయి. ఇకనైనా వర్షాలు కురియకపోతే పెట్టిన పెట్టుబడులు మట్టిపాలవుతాయి. వరుణుడు కరుణించాలని కోరుకుంటున్నాం.

- సముద్రాల సారంగం, రైతు, జఫర్‌గఢ్

విద్యుత్ అధికారుల పొలంబాట



పొలంబాటలో ఏఈ శివకుమార్, సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి సెక్షన్ పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో విద్యుత్ అధికారులు శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి విద్యుత్‌పరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్–72/100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఎల్ఎంలు కుంభం రాము, వెంకటేష్, సురేష్, అజయ్ పాల్గొన్నారు.

విద్యార్థుల యోగా ప్రదర్శన



యోగా అక్షర క్రమంలో కూర్చున్న విద్యార్థులు

పాలకుర్తి టౌన్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో సుధ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం యోగా అనే అక్షర క్రమంలో కుర్చొని యోగాతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. శనివారం జరిగే యోగా ప్రత్యేక కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవతం చేయాలని కరస్పాండెంట్ రాపాక విజయ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న పృథ్వీరెడ్డి

దేవరుప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడం కాకుండా ప్రజాపాలన హామీలను సత్వరమే నెరవేర్చాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డిలను ఉస్మానియా జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాదిన్నర కాలంగా ప్రజాసమస్యలను పట్టించుకోని నేతలు పల్లెబాట పేరిట స్థానిక సంస్థల్లో ఓట్లు పొందడానికి యత్నించడం తప్ప మరొకటి లేదన్నారు. పల్లెబాట పేరుతో గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఆరు గ్యారంటీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. కాగా, నియోజకవర్గంలో జర్నలిస్టులను బెదిరించడం అప్రజాస్వామికమని, వృత్తి ధర్మాన్ని పాటిస్తూ వార్తలు రాస్తున్న జర్నలిస్టులను ఝాన్సీరెడ్డి బెదిరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజకీయ, సామాజిక కార్యక్రమాలకు జర్నలిస్టులు రావొద్దనే చెప్పే హక్కు ఎవరికీ ఉండదని అన్నారు.

తండాల అభివృద్ధికి కృషి

● టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దాసుగూడెం తండా, కన్యా తండా, దంతాలగడ్డ, మేకల తండా తండాల్లో నిర్వహించిన పల్లె బాట కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ శ్యాంసుందర్ రెడ్డి, చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపోలు సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మార్కెట్ వైస్ చైర్మన్ అనుమల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్



మాట్లాడుతున్న సునీల్

బచ్చన్నపేట: జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక శ్రీనివాస్ గార్డెన్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 7న దండోరా జెండాను ఆవిష్కరించి అన్ని కులాల పెద్దలను సత్కరించి కృతజ్ఞతలు తెలపాలని సూచించారు. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, సందెన రవీందర్, అల్వాల రాజు, నల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్ కుమార్

బచ్చన్నపేట: బండనాగారానికి చెందిన గీత కార్మికుడు బత్తిని యాదగిరి ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి పడటంతో వెన్నెముకకు తీవ్ర గాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించిన యాదగిరి చికిత్స నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. కాగా, శుక్రవారం బాధిత కుటుంబానికి కిరణ్‌కుమార్ ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంకు, కిరణ్ కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నూకల బాల్ రెడ్డి, మట్టి బాలరాజు, మహేందర్, కూరాకుల రవి, ఇప్ప శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించాలని బాధితుల నిరసన



మాట్లాడుతున్న బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మాజీ ఎంపీటీసీ గన్ను నర్సింహులు కుమారుడు ఉమాశంకర్ తమవద్ద అవసరాల నిమిత్తం రూ.95లక్షలు అప్పుచేశాడని, అప్పు చెల్లించకుండా దబాయిస్తున్నారని ఆరోపిస్తూ జాతీయ రహదారి వెంట ఉన్న వారి ఇంటి ఎదుట ఘన్‌పూర్ పట్టణ కేంద్రానికి చెందిన మునిగెల విజయ్, బోనగిరి విద్యాసాగర్, కుమ్మరికుంట్ల ప్రదీప్ తదితరులు నిరసన చేపట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గన్ను నర్సింహులు కుటుంబ సభ్యులకు, బాధితులకు వాగ్వాదం జరుగగా రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఈ సందర్భంగా బాధితులు విజయ్, విద్యాసాగర్, ప్రదీప్ విలేకరులతో మాట్లాడారు. గన్ను ఉమాశంకర్, మేము స్నేహితులుగా ఉండేవారిమని, అవసరాల నిమిత్తం మా వద్ద రూ.95లక్షలు అప్పు తీసుకున్నారన్నారు. గన్ను నర్సింహులు ఎంపీటీసీగా చేసిన సమయంలో పలు సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేశారని, ఆ సమయంలో అతని కుమారుడిచే అప్పు తీసుకున్నాడని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉన్న అతడు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పలుమార్లు డబ్బులు అడిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. కాగా, గన్ను నర్సింహులును వివరణ కోరగా.. రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు ఉద్దేశ్యపూర్వకంగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నేను అప్పు ఉన్నట్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలు చూపాలన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెద్దాం

దేవరుప్పుల: సమన్వయంతో కార్యక్రమాలు విస్తరిస్తూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దామని మండల పరిశీలకుడు బిల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమడూరు, అప్పిరెడ్డిపల్లె, పడమటి తండా(ఎం)లో ఎంపీటీసీ క్లస్టర్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా ఇంటింటా అందిస్తున్న సంక్షేమ ఫలాలపై ప్రజలను చైతన్యం చేస్తూ పార్టీ బలోపేతం కోసం పాటుపడాలన్నారు. నాయకులు ఉప్పల సురేష్‌బాబు, జిల్లా డెయిరీ అధ్యక్షుడు ధర్మారెడ్డి, దావెర అనిల్‌కుమార్, రుద్రోజు భాస్కర్, జాకీర్, పులిగిళ్ల మల్లయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు మాలతి పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేరుతోంది



భూమిపూజలో పాల్గొన్న లింగం యాదవ్

తరిగొప్పుల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదోడి సొంతింటి కల నేరవేరుతోందని జిల్లా అబ్జర్వర్ బైకని లింగం యాదవ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ, బేడ బుడగ జంగాల కాలనీకి చెందిన పలువురు ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లు, జంగాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలసి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు ప్రశాంత్‌రెడ్డి,గంగం నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, బృంగి శివకుమార్, పండుగ కనుకయ్య, ఇంద్రారెడ్డి, వీకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ: పట్టణంలోని వీవర్స్ కాలనీ, గ్రేయిన్ మార్కెట్, గీతనగర్, వికాస్ నగర్, గిర్నిగడ్డ, బాణాపురం, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏరియాలో నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ ఏఈ సౌమ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగ దారులు సహకరించాలన్నారు.

'భూభారతి'పై సమీక్ష

కొడకండ్ల: భూభారతి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న శుక్రవారం పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో భూభారతితో పాటు కల్యాణలక్ష్మి, ప్రజావాణి, మీసేవ దరఖాస్తులు, రేషన్ బియ్యం పంపిణీపై ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

బచ్చన్నపేట: మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దార్ ఫణికిషోర్ తెలిపారు. శుక్రవారం కొడవటూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటికే సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని తహసీల్దార్ చెప్పారు. డీటీ స్రవంతి, ఆర్‌ఐలు వంశీకృష్ణ, మున్వర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జఫర్‌గఢ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సుమన్ కోరారు. కూనూర్, కోనాయిచలం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల పురోగతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో పాటు లబ్ధిదారులతో మాట్లాడారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని పూజలు

తరిగొప్పుల(నర్మెట): యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని కోరుతూ మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లులను మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, జిల్లా నాయకుడు పెద్ది రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ నాయక్, కంతి రాజలింగం, నక్కల రవి, బెడదం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తరిగొప్పుల (నర్మెట): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కెమిస్ట్రీ బోధించేందుకు (అవర్లీ బేసిస్) తాత్కాలిక పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) బీఎడ్ విద్యార్హతలు కలిగిన ఆసక్తిగల వారు ఈనెల 23వ తేదీ సాయంత్ర 3 గంటలలోగా పాఠశాలనందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు డెమో క్లాస్ ఉంటుందని, ఎంపికైన వారికి ప్రతీ పిరియడ్‌కు రూ.182లు గౌరవ వేతనం చెల్లించబడుతుందని ఆమె తెలిపారు. వివరాలకు 96769 59203 నందు సంప్రదించాని ఆమె తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ఎస్వీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాష్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో ఇంగ్లిష్, తెలుగ మీడియంలో చదివే అవకాశం ఉన్నందున ఆసక్తి కలిగిన వారు సెల్ నంబర్ 9849966009, 8555091124 లను సంప్రదించాలని సూచించారు.

నియామకం



గోపాల్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని తాటికొండకు చెందిన పాత్రికేయుడు నారబోయిన గోపాల్‌ను నియమించినట్లు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గోపాల్ శుక్రవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, జాతీయ కార్యదర్శి పి.ఆనందంతో పాటు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదిశగా కృషి చేస్తానన్నారు.

కేంద్రం నిధులతో రాష్ట్రం అభివృద్ధి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రం అభివృద్ధి చెందిందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాపిల్లి చక్రపాణి అన్నారు. శుక్రవారం బండనాగారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ గత 11 సంవత్సరాలుగా దేశ అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. కొల్ల వెంకటరెడ్డి, మిండ్లాపురం జలంధర్, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన సీపీఐ నాయకులు



కడియంకు వినతి పత్రం అందజేస్తున్న రాజారెడ్డి

రఘునాథపల్లి : కంచనపల్లిలో వృథాగా ఉంటున్న డబల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన వారికి అందించాలంటూ శుక్రవారం సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసుకుని వృథాగా ఉంటున్న డబల్ బెడ్రూం ఇళ్లలో ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. పార్టీ జిల్లా నాయకులు పాతూరు సుగుణమ్మ, ఆది సాయన పాల్గొన్నారు.

పలకల పంపిణీ

చిల్పూరు: వంగాలపల్లి గ్రామానికి చెందిన మనోహర్–రవళిల కుమారుడు విహాన్ అగస్త్య రెండో పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రంలో విద్యార్థులకు పలకలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

రఘునాథపల్లి: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో క్లబ్ అధ్యక్షుడు కందుల అనీల్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. లక్ష్మణ్, ప్రదీప్‌కుమార్, కోళ్ల రాజు, వేదకుమార్, రహీంద పాల్గొన్నారు.

యోగా డేలో పాల్గొనండి

బచ్చన్నపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు (శనివారం) నిర్వహించనున్న యోగా డే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని వైద్యాధికారి సృజన కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నిత్య జీవితంలో యోగా భాగం చేసుకోవాలని సూచించారు.

వీధి దీపాల సమస్యను పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని పలు వార్డుల్లో నెలకొన్న వీధిదీపాల సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివునిపల్లిలో గత కొద్దిరోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రి సమయంలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనికి చెందిన జోగు సతీష్(35)కు ఇదే మండలం కామారెడ్డిగూడేనికి చెందిన నర్మదతో వివాహం జరిగింది. కాగా, శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. రాత్రి 10.30 గంటలకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించాన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారి సీతారాంపురం స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని కడవెండికి చెందిన బొందుగుల కొండయ్య బైక్‌పై వెనుకాల కూర్చొని దేవరుప్పుల నుంచి సీతారాంపురం స్టేజీ వైపు వస్తున్నారు. ఇదే క్రమంలో సూర్యాపేట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న కారు వెనుకాల బైక్‌ను ఢీకొట్టడంతో కొండయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇంట్లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జనగామ: పట్టణంలోని 15వ వార్డు సంజయ్‌నగర్ పరిధిలోని ఓ ఇంట్లో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు మాయ మహేష్, భార్య స్వప్న ఇంటికి తాళం వేసి కూలీ పనికి వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఉన్న దుస్తులు, వంట సామగ్రి, రెండు తులాల బంగారం, రూ.లక్ష నగదు, రూ.60వేల విలువ చేసే కుట్టుమిషన్ మొత్తంగా లక్షల విలువ చేసే ఆస్తినష్టం జరిగిందని వారు తెలిపారు.